International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-9, September 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# కాళోజీ కవిత్వం - రాజకీయ దృక్పథం

**పి. స్వప్న,** ఎం.ఏ. (తెలుగు)
తెలుగు అధ్యాపకురాలు
కెఎస్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల,
నర్సంపేట వరంగల్. సెల్ : 9848838551

రాజకీయాలకు, నడుస్తున్న చరిత్రకూ, ఊరు నుంచి రాజధాని దాకా జరిగే పరిణామాలకూ కాళోజీ చాలా దగ్గర. ఒక పార్టీకి అంకితమవడం ఆయనికి పొసకదు. ఆ 'పార్టీవ్రత్యాన్ని" తూలనాడుతాడు. అంతిమంగా మనిషంటే ఏమిటి అనేది ఆయనకు కాలసిన అంశం.

అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు
ఏ పాటి వాడో చూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం కాదు
ఇందాకా ఏం చేసిండో
ఊడు, ఇప్పుడు కట్టే ముడుపులు కాదు
ఇందాక చెల్లించింది చూడు
పెట్టుకొనే టోపీ కాదు
పెట్టిన టోపీ చూడు
ఎగరేసిన జండా కాదు
చాటున ఆడంచిన దండాచూడు
మనిషిని చూడు, చరిత్రను చూడు
మడుపులు కాదు, నడవడి చూడు

సాఫీగా సాగిన ఈ కవిత కాళోజీ సూటిదనానికీ, విసురుకూ, అరమరికలు లేని తనానికి నిదర్శనం.

1934 నుంచి హైదరాబాద్, ముంబై తర్వాత ఉర్దూ, రకనీ రచయితలు ప్రగతిశీల సాహిత్యోద్యమానికి కేంద్రంగా ఉన్నది. దీనికి నాయకుడు మఖూం. అప్పుడే దకనీ భాషా నిపుణుడు నజీరుద్దిన్ హాష్మీ సంపాదకత్వాన

ఒక గొప్ప కవితా సంకలనం (ఉర్దూలో) వెలువడింది. ఆనాటి హైదరాబాద్‌కు చెందిన అన్ని శ్రేణులకు చెందిన స్త్రీలు, పురుషుల కవితలు ఇందులో ఉన్నాయి. ఈ సంకలనం ఆనాటి హైదరాబాద్ ఉర్దూ ప్రగతిశీల కవిత్వోద్యమంలో ప్రామాణికమైకమైన రచనగా పేరుగాంచింది. ఇంతే కాకుండా ఉర్దూలో గొప్ప కవిత రాసిన కాళోజీ కలం పేరు 'బాగి' అంటే తిరుగుబాటు దారుడు అని అర్థం. ఒక రకంగా మూడు భాషలలో కవిత రాసిన దార్శనికుడు కాళోజీ. నేటి ఆధునిక యుగంలో, ఒక జాతి సంప్రదాయాలు, విలువలు, జనజీవన పరిణామాల అంచనాకు కాళోజీ వంటి మహావ్యక్తి కలం నుంచి జాలు వారిన రచన కనుక 'నా గొడవ'కు విశేష ప్రాముఖ్యమున్నది. తెలంగాణే కాదు, ఆనాటి దక్కన్, హైదరాబాద్ స్టేట్‌లో వందేళ్ళ ప్రజా పోరాటాల దరిమిలా రూపుదిద్దుకున్న ప్రజాస్వామిక విప్లవ సంప్రదాయాలకు ఆ రచన సంకేతం.

రాజకీయ పార్టీలు ప్రజాస్వామిక వ్యవస్థలో అత్యంత కీలకమైన సంస్థలు, ఇవి ప్రజలకు తమ దృక్పథాన్ని తెలిపి సమీకరిస్తాయి. కొన్ని ప్రజాహిత కార్యక్రమాలను, నినాదాలను చేపడతాయి. అన్ని వర్గాల ప్రజల అవసరాలను గుర్తించి అధికారంలోకి రాగానే ప్రభుత్వాన్ని నడుపవలసి వుంటుంది. పార్టీఉ లేకుండా ప్రజాస్వామ్యం ప్రజాస్వామిక ప్రక్రియ అసాధ్యం. ఈ పార్టీలే చాలా అప్రజాస్వామికంగా, నిరంకుశంగా ప్రవర్తిస్తాయి. ఇటువంటి పార్టీలే ప్రజాస్వామ్య పాలన సంస్థల్లోకి ప్రవేశిస్తే అసలు ప్రజాస్వామ్యమే మిధ్య అయిపోతుందంటాడు కాళోజీ

"కలదందురు లోక సభను
కలదందురు ప్రభుత్వములోన పంచాయితిలో
కలదందురు రాజ్యాగంమున
కలదు ప్రజాస్వామ్యమెనుడు వింత కలదో? లేదో?
కలదందురు సంస్థలలో
కలదందురు సంస్థ జేయు తీర్మాణములో
కలదందురు అడుగడుగున
కలదు కలదు అనెడు వింత కలదో? లేదో ?
కలదందురు మనసులలో
గలమందురు చేసి చూపె కడు చేతలల్లో

ఫల మందురు వోటులకిది

కలదు ప్రజాస్వామ్య మనెడు వింత కలదో? లేదో అని వ్యంగంగా చెప్పాడు.

దాదాపుగా కాళోజీ రాసిన కవితలన్నీ సమకాలీన సమాజంలో రాజకీయ పరిస్థితులు, ప్రజల అగచాట్లు, ప్రజల కరత్వ్య నిర్దేశనకు సంబందించినవే. నైజాం వ్యతిరేక పోరాటం, రాజాకార్ల అరాచక అకృత్యాలు, ప్రజల తీవ్రస్థాయి ప్రతిఘటన, బాధ్యతారాహిత్యంగా పరిపాలించే నిజాం నిరంకుశ పాలన, స్వాతంత్ర్యం, గాంధేయవాదం, ఎమర్జెన్సీ, రాజ్యహింస, తెలంగాణాకు జరిగిన అన్యాయం లాంటి విషయాలపై రాసిన కవితలన్నీ కాళోజీ సామాజిక రాజకీయ అవగాహన, హక్కుల దృక్పథాన్ని తెలియజేస్తాయి.

1975 జూన్‌లో దేశంలో ఎమర్జన్సీని ప్రకటించినపుడు కాళోజీ తీవ్రంగా స్పందించాడు.

పౌర జీవితమ్ము కాలి

కమురు కంపు కొడుతుంటే

ఎమర్జన్సీ అత్తరుతో

ఏమాత్రం ఆపగలవు

రాష్ట్రపతి ఏమంటవు

సూటిగా రాష్ట్రపతిని ప్రశ్నిస్తూ చాలా కవితలు రాశాడు. వ్యక్తులకు భజన చేసే సంస్కృతిని చీల్చి చెండాడాడు. ఎమర్జన్సీ వాతావరణంలో ఫానిజమే వుంది. తప్ప ప్రజాస్వామ్యం లేదన్నాడు. అవినీతికి తెరదించింది ఎమర్జన్సీయే అనే వాదనను తిప్పికొట్టాడు.

1969–70 కాలంలో ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమం సాగుతున్నప్పుడు కాళోజీ పదునుగా కరకగా కవిత్వం రాశాడు.

తెలంగాణ వేరైతే

దేశానికి ఆపత్తా

తెలంగాణ వేరైతే

తెలుగు బాస మరుస్తారా

తెలంగాణ వేరైతే

చెలిమి తుట్టి పడుతుందా

వాన పడక వుంటుందా

చెలిమి లెండి పోతాయా

తెలంగాణ ప్రత్యేకత

తొలిసంజల పూస్తున్నది

ప్రజల శక్తి ప్రజ్వలించి

ప్రభల శక్తి ప్రజ్వలించి

ప్రభల ప్రసాదిస్తున్నది.

ఉద్యమానికి అడ్డుపడ్డ రాజకీయ వేత్లను పేరు పేరునా నిలదీశాడు. ప్రధానమంత్రిని ఉద్దేశిస్తూ తేట తెల్లమయే వ్యక్తీరణలో తెలంగాణ వేరు పడాలన్నాడు.

"ఒప్పందాలను నమ్మి

ఒప్పుకుంది చాలమ్మా

ఎవరి ప్రాంతమును వారిని

ఏలనియ్యి ఇందిరమ్మ

వేరు వేరుగ వుంటే

పోరువుండ బోదమ్మా

మరో రాజ్యమొకటి భరత

మాతకు బరువానమ్మా?

పడే పడక వేరు పడుట

చెడుట ఎట్లు అగునమ్మ?

తెగేదాక బిగియిస్తే

తెగును తాడు గదనమ్మ"

అని స్పష్టంగా వ్యక్తీకరించడం లోనే "కాళోజీ రాజకీయ దృక్పథం అన్ని రకాలుగా వెనుకబడిన తెలంగాణాను అభివృద్ధి చేయాలనే దృక్పథంగా అర్థం చేసుకోవాలి.

అధికారం మత్తుతో రాజకీయ వేత్తలు తూల, అధికారులు సత్తెపిత్తులై వెలమగ, ప్రజాహితం బ్రతుకు నీతి బరువుల చితుకుచు, మూల్గగ, ప్రజాస్వామ్య ముసుగు జారి, నిరంకుశం పడగ విప్పిందని బాధ పడ్డాడు. ప్రజాస్వామ్య సామ్యవాదోదయం అయోమయంగా మారిందని గందరగోళంగా తయారైందని బాధపడ్డాడు.

రాజకీయ నాయకులు – నటిసావిత్రి పూజలు చేసే వారకాంతల లాంటి వారు, పార్టీ పథకాల దాబు దలారీల లాంటి వారు అలాంటి వారికా ఓటు చేయడం? అని ప్రశ్నిస్తాడు.

సార, కూర, పోది, బేరలకు ఓటు వేస్తారా?

నల్ల బజారు భవణాలకు వెల్ల (సున్నం) వేయడానికా ఓటు?

సేటు బ్యాంకు నోటును కాయు (రక్షించే) కూటమికా ? ఓటు?

పోటీ చేయడానికి పర్మిటు చిట్టియా?

ప్రజాస్వామ్య అంత్యక్రియల సామాగ్రియా ఓటు?

వేటకాని పని సులువుకు మాటు,మంచెయా?

పౌరమతం సున్న జేయ నేతాగిరికా? ఓటు

ఎందుకు? ఎవరికి ఓటు వేస్తారు? అని ప్రశ్నించాడు? ప్రశ్నిస్తాడు. ఓటరు ఆలోచనకుఅవకాశం ఇచ్చాడు. మెదడుకు పదును పెట్టాడు. ఓటు వలువ ప్రజలకు తెలియజెప్పాడు. ఈ కవితను కాళోజీ 1966లో రాసినా, ఇప్పటికీ ఇవి సమాధానాలు లేని ప్రశ్నలుగానే మిగిలాయి.

'వ్యత్యాసాలు' అనే కవితలో సమాజంలో అన్ని రంగాల్లో ఉన్న వ్యత్యాసాలను, వివక్షలను ఎత్తి చూపుతాడు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ వివక్షకు తావుండ గూడ దంటాడు.

ప్రజాస్వామ్య మంటేమిటి?

ప్రజారాజ్య మంటేమిటి?

సౌజన్యాలకు రక్ష

సామరస్యాలకు రక్ష

సహజీవనానికి రక్ష

పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో ఎన్నికైన చట్ట సభల సభ్యులు ప్రజల క్షేమం కోసం చట్టాలు చేయాలి. ప్రభుత్వ పని తీరును కనిపెడుతూ, ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొంటూ, ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవాలి. కాని, వాస్తవానికి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల దృష్టిలో, వారి మద్దతు దార్ల దృష్టిలో, శాసన సభ్యులంటే ప్రచ్ఛన్నంగా రాజ్యాధికారాన్ని చెలాయించే పాలకులు, ప్రభుత్వాల మనుగడ చట్టసభల సభ్యుల మద్దతుపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి వారేం చెబితే అదే జరగాలి. వారి వారి నియోజక వర్గాల జమీందారీలలో శాసన సభ్యులు రారాజులు. ఎంతో వ్యయప్రయాసలకోర్చి చట్ట సభలకు ఎన్నికైనారు. కాబట్టి, సభ్యులు తమపెట్టుబడికి ఫలితం కోసం ఆశిస్తారు. ప్రభుత్వానికి వారి మద్దతు కావాలంటే వారు కోరిన బదిలీలు జరగాలి. లైసెన్సులు, పర్మిట్లు, టెండర్లు, కాంట్రాక్టులు, అటవీ సంపద వినియోగం గనుల లైసెన్సులు, టోల్‌గేట్లు నిర్వహణ, మద్యం వ్యాపారం, అంతా వారి ఇష్టాయిష్టాలకను గుణంగానే జరగాలి.

విలువలు లేని రాజకీయ పార్టీలో ప్రజల కోసం ఉన్నాయనే విలువలు గల సభ్యులున్నా లాభం లేదు అంటాడు కాళోజీ.

వ్యక్తిత్వ మంటేమిటి?

వైదుష్యమంటేమిటి?

వక్తృత్వమంటేమిటి?

కర్తృత్వమంటేమిటి?

పార్టీలో లేకున్న పనికి మాలిన వాడు

వైరి వర్గము కన్న దూరమైన వాడు

మంచివాడని

పది మంది యెంచిన నేమి?

బుజు వర్తనుండనుచు

లోకమెంచిన నేమి

తాకట్టు పడనట్టి

తల వానికుంటేమి?

తాకట్టు పెట్టని

తల వాని కుంటేమి?

తప్పేదో ఒప్పేదో?

చెప్పగలిగిన నేమి?

గొర్రె దాటున పడని

బుర్ర గలిగిన నేమి? అని ప్రశ్నించాడు.

చాలా ఆక్రోశంతో ఎన్నికైనా ప్రజా ప్రతినిధులను "మా ఓట్లకు పుట్టిన కొడుకుల్లారా" అని సంబోధిస్తాడు.

ప్రజల పట్ల ప్రజా రాజకీయాల పట్ల కాళోజీ నారాయణరావు గారి దృక్పథాన్ని అంచనా వేసే ప్రయత్నం చేసాను. సఫలీకృతం అయినాని భావిస్తున్నాను. కాళోజీ సృష్టించిన "ప్రజాకీయాలు" అనే పదం ఆచరణలోకి రావటానికి అందరం కృషి చేద్దాం.

జై తెలంగాణ ! జోహార్ కాళోజీ. !!

**ఉపకరించిన పుస్తకాలు:**

1. 'ప్రజాకవి కాళోజీ' సాహిత్య సమాలోచన సంపాదకులు – డా॥ గంటా జలంధర్‌రెడ్డి

2. పాలపిట్ట – సెప్టెంబర్ – 2013